నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
III | ఖమ్మం, గురువారం 1 మే 2025 | BHADRADRI KOTHAGUDEM

# 'భూ భారతి'తో రైతు సమస్యలు పరిష్కారం

## కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 30: భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. భవిషత్‌లో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావని అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో బుధవారం జరిగిన భూభారతి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ చట్టం ద్వారా రానున్న తరాలకు కూడా ఎటువంటి భూ సమస్యలు ఉండవని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. త్వరలో పాల్వంచ కేటీపీఎస్‌లో 800 మెగావాట్ల కర్మాగార నిర్మాణం జరుగుతుందని, మున్సిపల్ కార్పొరేషన్ కావడం వల్ల పాల్వంచ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతుందని, ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కూడా ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని అన్నారు. ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ, ఆర్డీవో మధు, తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ సుజాత, సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

# కాంగ్రెస్ సమావేశంలో రసాభాస

### పాల్వంచలో అర్ధాంతరంగా ముగిసిన జిల్లా సమావేశం

### మొదటి నుంచి పార్టీ జెండా మోసిన వారికి అన్యాయమంటూ రగడ

### ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే పెద్దపీట వేశారంటూ వీరంగం

నాయకులకు ప్రశ్నిస్తున్న కార్యకర్తలు

పాల్వంచ, ఏప్రిల్ 30 : పాల్వంచలోని ఓ హోటల్‌లో బుధవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ జిల్లాస్థాయి సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. కార్యకర్తలకు, నాయకుల మధ్య వాగ్వాదాలతో సమావేశమంతా రసాభాసగా మారింది. టీపీసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా అట్టడుగుస్థాయిలో పార్టీ నిర్మాణంపై చర్చించేందుకు రాష్ట్రం నుంచి రాష్ట్ర పరిశీలకులుగా ప్రమోద్‌కుమార్, శ్రావణ్‌కుమార్‌లు బుధవారం పాల్వంచకు వచ్చారు. డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అధ్యక్షతన జిల్లాలోని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ సమక్షంలో సమావేశం మొదలైంది. మీటింగ్ జరుగుతుండగానే కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున వాగ్వాదానికి దిగారు. పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపు లేకుండా పోయిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని అందలం ఎక్కించడం సరికాదని గొడవ చేశారు. పెద్ద మ్మగుడి పాలకమండలి సభ్యుల ఎంపిక విషయంలోనూ కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో పదవుల వ్యవహారంలో కూడా మొదటి నుంచీ ఉన్న వారికి గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యలో వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని అన్నారు. అయితే, ఎవరు ఏం మాట్లాడుతున్నారో అర్థంకాక అయోమయానికి గురైన పరిశీలకులు.. సమావేశాన్ని మధ్యలోనే ముగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# లిటిల్‌ఫ్లవర్స్ విజయదుందుభి

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులతో లిటిల్‌ఫ్లవర్స్ యాజమాన్యం

భద్రాచలం, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో భద్రాచలం లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. భద్రాచలం మండలంలో అత్యధిక మార్కులు సాధించి సత్తాచాటారు. పాఠశాలకు చెందిన చింతం గీతిక 600 మార్కులకు 574, తిరువీధుల చంద్రిక 565, ఈర్ల రాజ్‌కుమార్ 552 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాసవరప్రసాద్, మాగంటి రమేష్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. గణిత అధ్యాపకుడు ఎండీ బషీర్, విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ఎస్ఐకి సన్మానం

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 30: చాతకొండ 6వ బెటాలియన్ అసిస్టెంట్ సబ్ రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ పొందిన ఎం.పకీరిస్వామి బెటాలియన్ అసిస్టెంట్ కమాండెట్లు సన్మానించారు. 1987 బ్యాచ్ పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన ఎం.పకీరిస్వామి 39 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకొని అసిస్టెంట్ సబ్ రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. సన్మానించిన వారిలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీధర్‌రాజా, అబ్దుల్ రషీద్‌తోపాటు ఇతర అధికారులు ఉన్నారు.

# సీఎస్‌ను కలిసిన సింగరేణి సీఎండీ

సీఎస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎండీ

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 30: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారావును సింగరేణి సీఎండీ బలరాం బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మర్యాద పూర్వంకగా కలిసి సంస్థ తరపున శుభాకాంక్షలు తెలిపారు. కే.రామకృష్ణారావు ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉంటూ సింగరేణి సంస్థ బోర్డాఫ్ డైరెక్టర్లు ఒకరిగా సంస్థ అభివృద్ధికి ఎంతగానో సహకరించారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# పాల్వంచ పెట్రోల్ బంక్‌లో కల్తీ?

## అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న తూనికలు కొలతల అధికారి

పాల్వంచ, ఏప్రిల్ 30: పాల్వంచ ఇందిరా కాలనీలోని జాతీయ రహదారి పక్కన ఉన్న పెట్రోల్ బంకులో కల్తీ జరిగిందన్న బాధితుల ఫిర్యాదు మేరకు తూనికలు కొలతల జిల్లా అధికారి మనోహర్ బుధవారం సదరు పెట్రోల్ బంకును పరిశీలించారు. దంతెలబోర గ్రామానికి చెందిన యువకుడు నాగరాజు తన పల్సర్ బైక్ మైలేజీ కోసం ఎక్స్‌ట్రా మైలేజ్ పెట్రోల్ రూ.150 పోయించుకున్నాడు. ఒక కిలోమీటర్ దూరం పోగానే బైక్ ఆగిపోయింది. వెంటనే బైక్‌ను మెకానిక్ దగ్గరకు తీసుకెళ్లగా పెట్రోలలో నీళ్లు కలిసినట్లు అతడు నిర్ధారించాడు. దీంతో ఆ యువకుడు సదరు పెట్రోల్ బంక్ యజమానికి విషయాన్ని చెప్పగా సదరు యువకుడి పట్ల ఆ యజమాని అత్యంత దురుసగా ప్రవర్తించారు. దీంతో ఆ యువకుడు వెంటనే సివిల్ సివిల్ సప్లయిస్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారు రాకపోవడంతో తరువాత తూనికలు, కొలతల అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి పెట్రోల్ బంకును తనిఖీ చేసి నమూనాలు సేకరించారు.

# నర్సరీ, జామాయిల్ తోటల్లో మిడతల దండు

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 30: మండలంలోని శేసగిరినగర్‌లోని ఓ నర్సరీ పక్కన ఉన్న జామాయిల్ తోటలోకి మిడతలు దండు వచ్చింది. మిడతల శబ్దానికి రైతులు భయాందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా నర్సీరీ రైతు మాట్లాడుతూ.. బుధవారం ఉదయాన్నే తోట వద్దకు వచ్చిన సమయంలో పెద్ద శబ్దంతో లక్షలాదిగా మిడతల దండు వచ్చిందని, తాను తోటలోకి వెళ్లడంతో అవి వెళ్లిపోయాయని అన్నారు. పక్కనే ఉన్న జామాయిల్ చెట్లకు అంటిపెట్టుకొని శబ్దం చేస్తున్నాయని, వాటి శబ్దానికి భయం కలుగుతోందని తెలిపారు. పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకునేందుకు వ్యవసాయ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు.

# అకాల వర్షం.. తడిసిన ధాన్యం

తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

చుంచుపల్లి, ఏప్రిల్ 30 : భద్రాద్రి జిల్లా రైతులను అకాల వర్షం మరోసారి అరిగోస పెట్టింది. చుంచుపల్లి మండలంలో బుధవారం ఉదయం కురిసిన వర్షానికి పెనగడప, అంబేద్కర్‌నగర్, రాంపురం గ్రామాల్లోని ధాన్యం కేంద్రాల్లో ఆరబోసి ఉన్న ధాన్యం తడిసిపోయింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో ధాన్యం రాసులపై టార్పాలిన్లు కప్పేందుకు అన్నదాతలు పరుగులు తీశారు. అయినప్పటికీ అక్కడక్కడా ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటాలు పెట్టి మిల్లులకు తరలించి ఉంటే తాము ఇలా నష్టపోయేవాళ్లం కాదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

# నేటి నుంచి విద్యుత్ భద్రతా వారోత్సవాలు

గోడపత్రికలను విడుదల చేస్తున్న డిస్కం ఏడీఈ వెంకటరత్నం

అశ్వారావుపేట, ఏప్రిల్ 30 : మండలవ్యాప్తంగా మే 1వ తేదీ గురువారం నుంచి విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డిస్కం ఏడీఈ వెంకటరత్నం తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షణ, విద్యుత్ ఆదా, ఇతర సమస్యలపై వినియోగదారులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు బుధవారం స్థానిక కార్యాలయంలో గోడ పత్రికలను విడుదల చేశారు. విద్యుత్ సమస్యలపై అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నెంబర్ 1912 ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

# 'వేతనాలు పెంచకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం'

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 30: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల శ్రమను గుర్తించి వేతనాలు పెంచాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. తొలుత దీక్ష చేపట్టాక భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. వేతనాలు పెంచుకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. దీక్షకు వివిధ పార్టీల నేతలు మద్దతు తెలిపారు. జేఏసీ నాయకులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

చండ్రుగొండ, ఏప్రిల్ 30 : కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా చేపట్టిన మావోయిస్టుల ఏరివేత(ఆపరేషన్ కగార్)ను వెంటనే నిలుపుదల చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్‌కే ఉమ్మర్ డిమాండ్ చేశారు. బుధవారం చండ్రుగొండ మండలం వెంకటియాతండా, బాలియతండా, వంకనంబర్, కరిసలబోడు గ్రామాల్లో ఆపరేషన్ కగార్‌ను నిరసిస్తూ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. నాయకులు ఉమ్మర్, ధరావత్ బాబు, రాందాసు, రాంబాబు, వినోద్, రవి, రాము, రమేష్ పాల్గొన్నారు.

## డీసీసీ ఉద్యోగికి వీడ్కోలు సన్మానం

మణుగూరు టౌన్, ఏప్రిల్ 30 : ఖమ్మంజిల్లా కేంద్ర సహకార బ్యాంకు డీసీసీబీ మణుగూరులో విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన ఎల్లి రాజేంద్రప్రసాద్ అశ్విని దంపతులకు బుధవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో మణుగూరు సొసైటీ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, డీసీసీబీ మేనేజర్ మణుగూరు బాలరాజు, ఏడూళ్ల బయ్యారం మేనేజర్ సీతారామయ్య, కొత్తగూడెం మేనేజర్ రాగమయి, సుజాత పాల్గొన్నారు.

## ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా కల్యాణ్‌బాబు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 30 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నిక బుధవారం స్థానిక ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జి ఇసంపల్లి కృష్ణమాదిగ పాల్గొన్నారు. మణుగూరు మండలం అశోక్‌నగర్ గ్రామానికి చెందిన పోడుతూరి కల్యాణ్ బాబుని మండల అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా బ్రహ్మంగారిగుట్టకు చెందిన బొమ్మల వెంకన్నను ఎన్నుకున్నారు. కొమ్ము హుస్సేన్, చిట్యాల రజిత, కొండయ్య, రమేష్, రాము, కనకయ్య పాల్గొన్నారు.